క్లుప్తంగా

కబ్జాకు పాల్పడిన టీడీపీ నేత



వివాదాస్పద స్థలంలో చదును పనులు చేయిస్తున్న టీడీపీ నాయకుడు

ఓబులవారిపల్లె : దశాబ్దాలుగా వివాదంలో ఉన్న భూమిని వరుస సెలవులు రావడంతో ఆదివారం టీడీపీకి చెందిన మండల నాయకుడు జేసీబీ సాయంతో చదును చేసి కబ్జాలకు పాల్పడ్డాడు. సర్వే నెంబరు 378లో ఉన్న భూమి దశాబ్దాలుగా వివాదంలో ఉంది. గ్రామానికి చెందిన రైతులు ఆ భూమి ఆన్‌లైన్‌లో ఉందని, కొంతమంది పాస్ పుస్తకాలు, డీ-ఫారాలు ఉన్నాయని రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. సెలవురోజు కావడంతో అధికారులు అందుబాటులో లేకపోవడంతో జేసీబీ సహాయంతో చదును చేశారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి వివాదాస్పద భూమిని పరిశీలించి కబ్జాలు అడ్డుకోవాలని గ్రామ రైతులు కోరుతున్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

సంబేపల్లె : క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

రాయచోటి (జగదాంబసెంటర్) : రాయచోటి మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టడం జరుగుతుందని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మున్సిపల్ కార్యాలయానికి ఐసీఐసీఐ బ్యాంకు వారు డొనేట్ చేసిన ఐదు ఎలక్ట్రిక్ ఆటోలను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలోని ప్రతి వీధికి ఆటోలను పంపి చెత్త సేకరించి పట్టణాన్ని చెత్తరహిత మున్సిపాలిటీగా తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. రాయచోటి పట్టణంలోని ఐసీఐసీఐ బ్యాంకు వారు రూ.48 లక్షల విలువ చేసే ఐదు ఎలక్ట్రిక్ ఆటోలను మున్సిపాలిటీ అభివృద్ధికి డొనేట్ చేయడం ఎంతో శుభపరిణామమన్నారు.

పంచాయతీ భవన నిర్మాణానికి స్థల పరిశీలన

సిద్దవటం : మండలంలోని కడపాయపల్లె గ్రామ పంచాయతీ నూతన భవన నిర్మాణానికి గ్రామంలోని స్థలాన్ని పరిశీలించామని పంచాయతీ రాజ్ ఏఈ నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ కడపాయపల్లె గ్రామ పంచాయతీ నూతన భవన నిర్మాణానికి రూ. 32లక్షలతో అంచనాలు వేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపామన్నారు. గ్రామానికి చెందిన గొంటిముక్కల సుబ్బరాయుడు పంచాయతీ భవన నిర్మాణం కోసం తన 4 సెంట్ల స్థలాన్ని పంచాయతీకి బదిలీ చేయడం శుభపరిణామమన్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకటేష్ మాట్లాడుతూ నూతన భవన నిర్మాణానికి గ్రామ సభ ద్వార గ్రామస్తుల అభిప్రాయాన్ని తీసుకున్నట్టు తెలియజేశారు.

పేకాట స్థావరంపై దాడి

సుండుపల్లె : సిద్ధారెడ్డిగారిపల్లె సమీపంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో ఎస్‌ఐ ముత్యాల శ్రీనివాసులు తన సిబ్బందితో కలసి స్థావరంపై దాడి చేశారు. అక్కడ జూదమాడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.5060 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

బొప్పాయి సాగుకు కోతుల గండం


- చేన్లలో గుంపులుగా సంచరిస్తూ మొక్కలను దెబ్బతీస్తున్న కోతులు
- తీవ్రంగా నష్టపోతున్నామంటూ రైతుల ఆవేదన
- సోలార్ కంచె ఏర్పాటుకు ప్రభుత్వం సబ్సిడీ ఇవ్వాలంటూ విన్నపం



బొప్పాయి నాటడానికి మడకతో సాళ్లు చేస్తున్న రైతు



బొప్పాయి తోటలో సోలార్ ఏర్పాటు చేసిన రైతు



బొప్పాయి మొక్కలను కోతులు పెరికి వేయడంతో బీడుపోయి కనిపిస్తున్న చేను

చిట్వేలి : బొప్పాయి పంటకు ఒక వైపు ప్రకృతి, మరోవైపు కోతుల గండంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో గత ఏడాది సుమారు 8వేల ఎకరాల్లో బొప్పాయి పంటను సాగుచేశారు. మార్కెట్లో ధరలు బాగా ఉండడంతో రైతులు మంచి ఆదాయం పొందారు. దీంతో ఈ ఏడాది 10వేల ఎకరాల్లో బొప్పాయి సాగు చేసే అవకాశాలు ఉన్నాయి. ఈ ఏడాది వాతావరణం అనుకూలించకపోవడంతో పంటసాగు రెండు నెలలు ఆలస్యంగా ప్రారంభమైంది. ఇప్పటికే సుమారు 7వేల ఎకరాల్లో మొక్కలు నాటారు. 10 రోజుల లోపల మరో 3వేల ఎకరాల్లో పంట సాగు చేసే అవకాశాలు ఉన్నాయి. ఎకరానికి 1250 మొక్కల చొప్పున నాటారు. ఒక్కో మొక్క రూ.12కు రైతులు కొనుగోలు చేసి నాటుకున్నారు. ఎక్కువ మంది రైతులు డ్రిప్ సౌకర్యం ఏర్పాటు చేసుకోగా కొద్దిమంది మాత్రం మొక్కల పాదుల్లో నీళ్ల పోసి సాగు చేస్తున్నారు. ఈపంట సాగుకు కోతుల బెడద ఎక్కువగా ఉంది. కోతులు తోటల మీదపడి చిన్న మొక్కలను విరచి తినేస్తున్నాయని రైతులు గగ్గోలు పెడుతున్నారు. దీంతో ప్రతి రైతు కూలీలను కాపలా పెట్టడంతోపాటు వేలాది రూపాయలు వెచ్చించి సోలార్ కంచె ఏర్పాటు చేసుకున్నారు. ఈపంట సాగుచేయాలన్నా కోతులను నివారించడానికి సోలార్ కంచె ఏర్పాటు చేస్తున్నట్టు రైతులు తెలియజేస్తున్నారు. మార్కెట్‌లో దొరికే సోలార్ పరికరాలు నాసిరకం కావడంతో తొందరగా పాడైపోతున్నాయని, ప్రభుత్వం సబ్సిడీపై నాణ్యమైన సోలార్ ప్యానెళ్లను రైతులకు అందించాలని కోరుతున్నారు. సోలార్ కంచె లేనిదే ఏ పంటలు సాగుచేసే పరిస్థితి లేదని రైతులు అంటున్నారు.

పంటలకు మద్దతు ధర ఇవ్వాలి



ప్రస్తుత పరిస్థితుల్లో వ్యవసాయం తలకు మించిన భారం అయ్యింది. ఒకవైపు ప్రకృతి, వైపరీత్యాలు మరోవైపు అంతుబట్టని తెగుళ్ల, కూలీల కొరత, పెరిగిపోయిన కూలిరేట్లు అన్నింటికీ మించి కోతులు బెడద వ్యవసాయాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. ఉపాధిహామీ కూలీలకు వరమే అయినా వ్యవసాయం చేస్తున్న రైతుకు మాత్రం శాపంగా పరిణమించింది. ప్రభుత్వాలు వ్యవసాయానికి అనుకూలమైన నిర్ణయాలు, మద్దతు ధర అందించి ఆదుకోవాలి.

\- మన్నూరు సుధీర్ రెడ్డి, మార్గోపల్లి, చిట్వేలి మండలం

కోతుల బెడద ఎక్కువగా ఉంది



ప్రకృతి వైపరీత్యాలు, కోతుల బెడద బొప్పాయికి శాపం కాగా ఈ రెండు కలిసి రైతులకు ప్రధాన శత్రువులుగా మారాయి. నేను 4 ఎకరాలలో బొప్పాయి సాగు చేస్తున్నాను. కాపలా ఉంచినా, సోలార్ ఏర్పాటు చేసినా 50 సెంట్లలో కోతులు మొక్కలను పెరికేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. బొప్పాయి సాగు చేసే రైతులు చేనుకు కచ్చితంగా సోలార్ కంచె ఏర్పాటు చేయాల్సిందే. కావున ప్రభుత్వం సబ్సిడీపై సోలార్ కంచెలను రైతులకు మంచి చేసినట్టు అవుతుంది.

\- ఓబినేని ఈశ్వరయ్య, భాకరాపురం, కొత్తపల్లి, చిట్వేలి మండలం

సంక్రాంతి కొత్త కాంతులు నింపాలి



పీవీ మిథున్‌రెడ్డి



మేడా రఘునాథరెడ్డి



ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి



గడికోట శ్రీకాంత్ రెడ్డి



కొరముట్ల శ్రీనివాసులు

రాయచోటి/రాజంపేట/రైల్వేకోడూరు అర్బన్ : తెలుగు సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా సంక్రాంతి నిలుస్తుందని రాజ్యసభ సభ్యులు మేడా, ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆకేపాటి, మాజీ ఎమ్మెల్యేలు శ్రీకాంత్ రెడ్డి, కొరముట్ల పేర్కొన్నారు. ఆదివారం వారు పత్రికలకు వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశారు. సంక్రాంతి ప్రజలందరి జీవితాలలో కొత్త కాంతులు నింపాలని ఆకాంక్షించారు. సొంత గ్రామాల మీద మమకారానికి, రైతులకు ఇచ్చే గౌరవానికి ప్రతీకగా సంక్రాంతి నిలుస్తుందన్నారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా జగన్ ప్రభుత్వం కృషి చేయడమేకాక అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలను అందించిందని వారు గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం రైతులను మోసం చేయడంతో సంక్రాంతి పండుగ కళ గ్రామాల్లో లేకుండా పోయిందన్నారు. నిత్యావసర సరుకుల ధరలు పెరగడంతో ప్రజలకు పండుగ భారంగా మారిందన్నారు.

స్ఫూర్తి ప్రదాత స్వామి వివేకానంద



రాజంపేట: విజేతలకు ప్రశంసా పత్రాలను అందజేస్తున్న చొప్పా గంగిరెడ్డి

రాజంపేట : నేటి యువత వివేకానందుని జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని తమ జీవితంలో ముందుకెళ్లాలని అన్నమాచార్య యూనవర్సిటీ చాన్స్‌లర్ చొప్పా గంగిరెడ్డి అన్నారు. ఆదివారం అన్నమాచార్య యూనవర్శిటీలో వివేకానంద జయంతి సందర్భంగా వేడుకలను నిర్వహించారు. జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. యువతీయువకుల్లో పట్టుదల, కృషి కలిగి ఉండాలన్నారు. నైతిక విలువలను పాటించాలన్నారు. సమాజసేవలో భాగస్వామ్యం కావాలన్నారు. కార్యక్రమంలో రిజిస్టార్ డా.మల్లికార్జునరావు, హ్యూమానిటీస్ అండ్ సైన్సెస్ హెచ్‌ఓడీ డా.బాలనాగేంద్రప్రసాద్, టచ్ కో-ఆర్డినేటర్ పి.విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అంతకముందుగా వ్యాసరచన పోటీలలో విజేతలుగా నిలిచిన చందన, షకీబ్, కుసీదాలకు ప్రశంసా పత్రాలను చాన్స్‌లర్ చొప్పా గంగిరెడ్డి అందజేశారు.

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో బీజేపీ, విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం స్వామి వివేకానంద జయంతిని ఘనంగా నిర్వహించారు. స్వామి వివేకానందుని చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం పట్టణ వీధుల్లో నగర సంకీర్తన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి యువతకు స్వామి వివేకానంద జీవితం ఆదర్శం కావాలన్నారు. ఆయన దేశంలోని యువకులలో ఉత్తేజాన్ని నింపారని చెప్పారు. ఈకార్యక్రమంలో నాయకులు, యువకులు పాల్గొన్నారు.

పుల్లంపేట : మండల పరిధిలోని దళవాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో ఆదివారం స్వామి వివేకానంద జయంతి వేడుకలు ఉపాధ్యాయుడు రమణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఉపాధ్యాయుడు రమణ మాట్లాడుతూ యువతికి స్ఫూర్తి ప్రదాత స్వామి వివేకానంద అని, భారత దేశ ప్రతిష్ఠతను విశ్వవ్యాప్తం చేసిన చైతన్య మూర్తి అని కొనియాడారు. ప్రతి ఒక్కరూ ఆయన అడుగుజాడల్లో నడవాలని తెలియజేశారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

రామాపురంలో..

రామాపురం : మండల కేంద్రంలోని హరిహరాలయంలో అయోధ్యలో బాల రాముని ప్రతిష్ఠించే సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా వేడుకను నిర్వహించారు. అలానే వివేకానంద స్వామి జయంతిని ఆదివారం జిల్లా భజరంగ్ దళ్ యోజక్ కొవ్వూరి వీరారెడ్డి ఆధ్వర్యంలో జరిపారు. స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలతో నివాళి అర్పించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ మండల ప్రముఖ్ ఆంజనేయులు, అర్చక పూరోహిత ప్రముఖ్ నాగరాజ, సీతారామయ్య, సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా సంజీవరాయస్వామికి పొంగళ్లు



అన్నప్రసాదం సమర్పిస్తున్న గ్రామ ప్రజలు

పుల్లంపేట : మండలంలోని తిప్పాయిపల్లి గ్రామంలో సంక్రాంతికి ముందు వచ్చే ఆదివారం సంజీవరాయస్వామికి పురుషులు మాత్రమే పొంగళ్ల నిర్వహించడం ఆనవాయితీ. ఆదివారం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపించారు. తిప్పాయిపల్లి గ్రామంలో పూర్వం ఒక సాధువు ఆ ఊరిలో చెట్టు కింద జీవనం సాగించేవారు. గ్రామంలో పురుషులు మాత్రమే అన్నం పెడితే తినేవారు. మహిళలు అన్నం పెడితే తినేవారు కాదు. ఆ గ్రామం నుంచి వెళ్లిపోతూ భీజాక్షరాలతో ఆంజనేయస్వామి శిలాఫలకాన్ని స్థాపించి వెళ్తూ ఈ దేవస్థానంలోకి మహిళలు వెళ్లరాదని, పురుషులు మాత్రమే పొంగళ్లు పెడితే గ్రామంలో సమృద్ధిగా పాడిపంటలు పండుతాయని, గ్రామం దినదినాభివృద్ధి చెందుతుందన్నారు. దీంతో అప్పటి నుంచి ఇప్పటి వరకు గ్రామంలో ప్రజలు క్రమం తప్పకుండా ప్రతి సంక్రాంతికి ముందువచ్చే ఆదివారం పురుషులు పొంగళ్లు నిర్వహించుకుంటూ స్వామివారికి నైవేద్యం సమర్పిస్తూ వస్తున్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న ఎర్రపురెడ్డి జయమ్మ

సుండుపల్లె : మానవత సేవా సంస్థ చైర్మన్ మిన్నం రెడ్డి గంగిరెడ్డి సహకారంతో మాజీ జెడ్పీటీసీ ఎర్రపురెడ్డి జయమ్మ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా సంస్థ సభ్యులందరూ కలిసి పారిశుద్ధ్య కార్మికులకు ఆదివారం చీరలు పంపిణీ చేశారు.కార్యక్రమంలో మానవత సభ్యులు పాల్గొన్నారు.

కోడిపందెం స్థావరాలు తనిఖీ

సిద్దవటం : మండలంలోని కోడిపందాల స్థావరాలను విస్తృతంగా తనిఖీ చేసినట్టు సిద్దవటం ఏఎస్‌ఐ సుబ్బరామచంద్ర తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ మండలంలో కోడిపందేల స్థావరాలైన రామస్వామి పల్లె, జౌకుల పల్లి, మాధవరం, జ్యోతి, నేకనాపురం తదితర గ్రామాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టామన్నారు. పండుగ పేరుతో కోడిపందాలు, పేకాట, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ శివప్రసాద్‌రెడ్డి, పోలీసులు రామ్‌కుమార్, రాఘవేంద్ర, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఓబులవారిపల్లె : కోడి పందేలు, జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ పి.మహేష్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సంక్రాంతి గ్రామీణ ప్రాంతాలకు చెందిన పండుగ కాబట్టి ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు అందరితో కలిసి సంతోషంగా పండుగను జరుపుకోవాలన్నారు. మంగంపేట, వై.కోట, గాదెల, వెంకటాపురం తదితర గ్రామాలలో కోడి పందేల స్థావరాలు ఏర్పాటు చేసినట్లైతే ప్రజలు 9121100580 ఫోన్ నెంబరుకు సమాచారం ఇవ్వాలని సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని అన్నారు.

సంస్కృతికి ప్రతిబింబం సంక్రాంతి



రాజంపేట టౌన్: బహుమతి ప్రదానం చేస్తున్న అమర్‌నాథ్‌రెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి

రాజంపేట టౌన్ : తెలుగువారి సంస్కృతి, సాంప్రదాయాలకు సంక్రాంతి ప్రతిబింబమని ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ఆకేపాటి ఎస్టేట్‌లో సంక్రాంతి వేడుకలను పురస్కరించుకొని ఆదివారం ఆకేపాటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయిలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఎమ్మెల్యే, ఆయన సోదరుడు వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. సంక్రాంతి పెద్దపండుగ అని ఈ పండుగ సందర్భంగా అందరూ ఆనందంగా ఉండటం కోసం ఆకేపాటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివిధ రకాల పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళలకు ముగ్గులంటే ఎంతో ఇష్టమైనందున ముగ్గుల పోటీలను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఈ పోటీల్లో బహుమతి రానివారు ఏమాత్రం చింతించవద్దన్నారు. పోటీల్లో పాల్గొన్న మహిళలంతా ముగ్గులను బాగా వేసినట్లు న్యాయ నిర్ణేతలు చెప్పారన్నారు. మహిళలు ఒకచోట చేరి కొద్దిసేపు ఆనందంగా గడపటమే ఈ పోటీల ప్రధాన ఉద్దేశమన్నారు. సంక్రాంతి పండుగను ప్రజలందరు సంతోషంగా జరుపుకోవాలని ఆకేపాటి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షులు జబ్బిరెడ్డి వెంకటరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విజేతలు వీరే..

ఆకేపాటి ఫౌండేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో ప్రథమ బహుమతిని దిగువమందపల్లెకు చెందిన అమరసామి హరిత, ద్వితీయ బహుమతిని పెద్దూరుకు చెందిన మందపల్లి హేమ, తృతీయ బహుమతిని బొమ్మవరం రెడ్డెమ్మ కైవసం చేసుకున్నారు. కాగా ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా ప్రభుత్వ ఉపాధ్యాయిని అన్నపూర్ణ, వైఎస్సార్ సీపీ మహిళా నాయకురాలు మిర్యాల సురేఖ తదితరులు వ్యవహరించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా కృషి



ముస్లిం మత పెద్దలతో ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి

సుండుపల్లె : మండల పరిధిలోని తిమ్మసముద్రం గ్రామంలో ఆదివారం ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి, స్థానిక మండల నాయకులు కలిసి ముస్లిం మతపెద్దలతో సమావేశమయ్యారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం లెగిశెట్టిపల్లిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త లెగిశెట్టి శంకర్ కుటుంబ సభ్యుడు సిద్దయ్య మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ రామస్వామి రెడ్డి, జెడ్పీటీసీ ఇస్మాయిల్, మధుసూదన్ రెడ్డి, హకీమ్ బాషా, రెహమాన్ ఖాన్, చంద్ర నాయక్, రామజయచంద్ర, ఆదాం ఖాన్, నాగేశ్వరరావు, శేఖర్ రెడ్డి, మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

ఆర్‌టీఐ యాక్ట్‌ను గ్రామాల్లో పటిష్టం చేయాలి



ఎమ్మెల్సీని సత్కరిస్తున్న ఎంపీపీ సుదర్శన్ రెడ్డి

లక్కిరెడ్డిపల్లి : వైఎస్సార్ సీపీ శ్రేణులు ఆర్టీఐ యాక్ట్‌ను గ్రామస్థాయిలో పటిష్టం చేయాలని గుంటూరు, కృష్ణ ఉమ్మడి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ, ఆర్టీఐ యాక్ట్ విభాగం వైఎస్సార్‌సీపీ స్టేట్ ప్రెసిడెంట్ తమటం కల్పలత పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని స్థానిక ఎంపీపీ మద్దిరేవుల నివాసంలో ఆమె వైఎస్సార్ కార్యకర్తలు, నాయకులతో సమావేశమయ్యారు. సుదర్శన్‌రెడ్డి ఎమ్మెల్సీని సత్కరించారు. ఆమె మాట్లాడుతూ సమాచారం తెలుసుకునే హక్కు అందరికి ఉందన్నారు.

వేడుకగా విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



2004-05 బ్యాచ్ పదవ తరగతి విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఒంటిమిట్ట : మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో ఆదివారం నిర్వహించిన 2004 – 05 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం వేడుకగా సాగింది. 20 సంవత్సరాలు తరువాత కలుసుకున్న విద్యార్థులు, ఆనాటి ఉపాధ్యాయులతో కలిసి కార్యక్రమంలో పాల్గొనగా చిరునవ్వులు, పలుకరింపులు, ఆత్మీయ ఆలింగనాలతో కార్యక్రమం సందడిగా సాగింది. అమరులైన తెలుగు ఉపాధ్యాయులు కృష్ణయ్య, గుర్రప్ప నాయుడు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమానికి పాఠశాల పూర్వ ప్రధానోపాధ్యాయులు బోడా రామయ్య అధ్యక్షత వహించారు.

ఆయన మాట్లాడుతూ తాను అదేస్థానంలో ఉంటూ విద్యార్థుల ఉన్నతిని కోరుకునే ఉపాధ్యాయుడి పట్ల విద్యార్థులకు ఎనలేని గౌరవం ఉంటుందన్నారు. అంతటి గౌరవాన్ని అందిస్తున్న ఆనాటి విద్యార్థులకు ఆయన ఆశీస్సులు అందించారు. అనంతరం ఉపాధ్యాయుడు డాక్టర్ రహీం, డాక్టర్ వి బ్రహ్మయ్య, జ్యోతిర్మయి, మంజులవాణి, భాస్కర్ రావు, వెంకటేశ్వర్లు, రాజారెడ్డి, దత్తాత్రేయులు, సుబ్బయ్య, నారాయణ, రాధాకృష్ణ, ఈశ్వరీదేవి, బాష, సుధారాణి, గోపినాథ్, వై.సి సుబ్బరాయుడు, సుందర్, ఉమా మహేశ్వర్, హరిప్రసాద్ తదితర ఉపాధ్యాయులందరూ మాట్లాడి విద్యార్థులను ఆశీర్వదించారు. అనంతరం విద్యాబుద్ధులు చెప్పి తమ ఉన్నతికి సహకరించిన ఉపాధ్యాయులను విద్యార్థులు ఘనంగా సత్కరించారు.

గాలివీడులో విద్యార్థుల అపూర్వ కలయిక



2001-02 పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

గాలివీడు : మండల పరిధిలోని శ్రీ వివేకానంద హైస్కూల్‌లో 2001 – 02 బ్యాచ్ పదవ తరగతి విద్యార్థులు ఆత్మీయ సమావేశం ఆదివారం నిర్వహించారు. స్థానిక ఆర్ఆర్ కళాశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆనందోత్సాహాల మధ్య జరిగింది. ఈ సందర్భంగా నాటి విద్యార్థులు పాఠశాలలో పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పూర్వపు విద్యార్థులు ఒకరినొకరు కలుసుకొని వారి కుటుంబాల పరిస్థితులు, యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యను అభ్యసించిన రోజుల్లో గత స్మృతులను నెమరవేసుకున్నారు. 24 సంవత్సరాల తర్వాత తోటి విద్యార్థులను, ఉపాధ్యాయులను కలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం ఉపాధ్యాయులను విద్యార్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వీరారెడ్డి, రమణారెడ్డి, రామకృష్ణ, బేగ్ తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి

రాజంపేట : సంక్రాంతి మన సంప్రాదాయలకు ప్రతీక అని ఏయూ ప్రో చాన్స్‌లర్ చొప్పా అభిషేక్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఏఐటీఎస్ క్రీడా మైదానంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతోపాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. మకర సంక్రాంతి సందర్భంగా ఈ టోర్నమెంట్ నిర్వహించడం ఆనందదాయకమన్నారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకు న్నారు. కార్యక్రమంలో చొప్పా సోదరుడు అభినవ్, ఫిజికల్ డైరక్టర్ డా.బి.నాగముని, డా.కిషోర్‌కుమార్, దినేష్, సయవుల్లా పాల్గొన్నారు. ఈ టోర్నీలో 12 జట్లు పాల్గొన్నాయి.

విద్యార్థులకు అభినందన



పాటల పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో హెచ్‌ఎం శ్రీనివాసులు తదితరులు

గాలివీడు : విద్యార్థులు విద్యతోపాటు అన్ని రంగాల్లో రాణించేలా కృషి చేయాలని నూలివీడు జెడ్పీ హెచ్‌ఎస్ హెచ్‌ఎం శ్రీనివాసులు అన్నారు. శనివారం కడప పట్టణంలోని కళా సామ్రాట్ సేవా సంస్థ వారి ఆధ్వర్యంలో జరిగిన సంక్రాంతి సంబరాల్లో జరిగిన పాటల పోటీల్లో ప్రతిభ కనబరచి బహుమతులు పొందిన తమ పాఠశాల పదవ తరగతి విద్యార్థిని ఎం. మీనాక్షి, ఎనిమిదవ తరగతి విద్యార్థిని ఎస్.షభానా ను అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ జనార్దన్, వైస్ చైర్మన్ కె.విజయమ్మ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆత్మీయ ఆటలకు సిద్ధమైన మైదానాలు



క్రికెట్ మ్యాచ్ కోసం పిచ్‌ను సిద్ధం చేస్తున్న మాజీ క్రీడాకారులు

రాజంపేట టౌన్ : అనాదిగా ప్రజలు సంక్రాంతి పండుగను సరదాల సమ్మేళనాలకు, ఆత్మీయ కలయికకు ఓ వేదికగా చేసుకుంటున్నారు. సంక్రాంతిని పురస్కరించుకొని అనేక మంది ఇప్పటికే వారి స్వగ్రామాలకు చేరుకున్నారు. అలా స్వగ్రామాలకు చేరుకున్న వారు మూడు రోజులపాటు సరదాగా గడిపేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. కొంతమంది పూర్వ విద్యార్థుల సమ్మేళనాల పేరిట తాము చదువుకున్న విద్యాసంస్థల్లో కలుసుకునేందుకు సిద్ధమయ్యారు. అందువల్ల సంక్రాంతి పండుగ అపూర్వ కలయికలకు వేదిక కానుంది. ఇదిలావుంటే ఉమ్మడి వైఎస్సార్‌జిల్లాలో 1990వ దశకం వరకు రాజంపేట క్రికెట్ క్లబ్ (ఆర్‌సీసీ) రాష్ట్రవ్యాప్తంగా కూడా ఎంతో గుర్తింపు తెచ్చుకొని ప్రసిద్ధిగాంచింది. ఒకప్పటి ఆర్‌సీసీ క్రీడాకారులు సోమవారం భోగి పండుగ రోజున రాజంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో క్రికెట్ మ్యాచ్‌ను ఆడనున్నారు. రాజంపేటలో ఉన్నవారే కాక ఇతర రాష్ట్రాల్లో, వివిధ ప్రాంతాల్లో ఉన్న వారు సైతం చిన్నప్పటి తోటి క్రీడాకారులను కలుసుకొని క్రికెట్ ఆడేందుకు తరలిరానున్నారు. వీరిలో కొంతమంది ప్రముఖ రాజకీయ నాయకులతోపాటు ఉన్నత స్థాయి అధికారులు, వివిధ శాఖల్లో పనిచేసే ప్రభుత్వ ఉద్యోగులు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు ఉన్నారు. వీరంతా కూడా ఆరు, ఐదు పదుల వయస్సు పైబడినవారు కావడం విశేషం. కాగా రాజంపేటలో ఉన్న పలువురు ఆర్‌సీసీ మాజీ క్రికెట్ క్రీడాకారులు భోగి పండుగ రోజు ఆడే క్రికెట్ మ్యాచ్ కోసం ఆదివారం క్రీడా మైదానాన్ని దగ్గరుండి సిద్ధం చేయించారు. ఏది ఏమైనా ఐదు, ఆరు పదుల వయస్సు పైబడిన వారు చిన్ననాటి క్రీడాకారులతో క్రికెట్ మ్యాచ్ ఆడనుండటం విశేషమని చెప్పాలి.

నల్లగంగమ్మకు పూజలు



అలంకరణలో దేవరరాయి నల్లగంగమ్మ

సంబేపల్లె : మండల కేంద్రంలోని శ్రీ దేవరరాయి నల్లగంగమ్మ ఆలయంలో ఆదివారం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా వేపాకులతో ఆలయ ప్రాంగణమంతా శుద్ధి చేశారు. అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చకులు, అభిషేకాలు నిర్వహించి విశేషంగా అలంకరించారు. మొక్కుబడులు ఉన్న భక్తులు అమ్మవారికి పూజలు చేయించారు. వచ్చిన భక్తులకు అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు.